Follow: @ANNTELUGU
REGISTERED NUMBER APTEL/2014/58382
14-05-2026
ANN తెలుగు
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 137 పేజీలు-04 వెల-రూ.1
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD గురువారం WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్



ఏ క్షణమైనా పెట్రోల్, డీజిల్ ధరలు **పెరిగే ఛాన్స్**

- ఆర్బీఐ గవర్నర్

02



కేరళ సస్పెన్స్ **కథాచిత్రం**

- నేడు సీఎం ఎంపిక
- కేసీ వర్సెస్ సతీషన్

02



రైతులకు కేంద్రం **గుడ్ న్యూస్**

- వరికి కనీస మద్దతు ధర పెంపు
- క్వింటాకు రూ.72 పెంచిన కేంద్రం

02




## విశ్వాసం విజయ్ పైనే...

### 144 ఓట్లతో గట్టెక్కిన టీవీకే సర్కార్!

అన్నాడీఎంకే లో మేజర్ చీలిక.. విజయ్ కే సపోర్ట్

ఐదేళ్ళు సుస్థిర పాలన అందిస్తామని సీఎం ప్రకటన

**చెన్నై, మహా:** విశ్వాసపరీక్షలో తమిళనాడు సీఎం విజయ్ నెగ్గారు. అంచనాలకు మించి మద్దతు కూడగట్టారు. తమది సుస్థిర సర్కార్ అని, ఐదేళ్ళు మంచి పాలన అందిస్తామని ప్రకటించారు. విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకుని మిగతా 2లో



దేశం క్లిష్టపరిస్థితుల్లో..

# ప్రళయానికి ముందు ప్రశాంతత?

## గ్లోబల్ ఎకనామిక్ వార్నింగ్‌తో భారత్ అలర్ట్

చమురు సెగలు, డాలర్ దెబ్బ.. మోదీ పొదుపు మంత్రం వెనుక అసలు రహస్యం ఇదే

కాన్వాయ్ కట్.. చేసి చూపించిన మోదీ.. కేవలం రెండు వాహనాలతో పర్యటనలు

అదే బాటలో యోగి ఆదిత్యనాథ్.. ఉత్తర ప్రదేశ్ లో అనేక సంచలన నిర్ణయాలు

వారానికి ఒకరోజు వాహన రహిత దినోత్సవం పాటించాలని పిలుపు

ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్.. బంగారం బదులు స్థానిక ఉత్పత్తులు కొనాలని సూచన

అదే బాటలో మరిన్ని రాష్ట్రాలు.. ఫ్యూచర్ లో అంతా వర్క్ ఫ్రమ్ హోమే అంటున్న చంద్రబాబు

**మహా నెట్ వర్క్:**

ప్రపంచం ఒక నిశ్శబ్ద యుద్ధాన్ని ఎదుర్కొంటోంది. ఇది సరిహద్దుల్లో తుపాకులతో జరుగుతున్న యుద్ధం కాదు.. దేశాల ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్న 'ఇంధన సంక్షోభ' యుద్ధం. రష్యా-ఉక్రెయిన్ నుంచి మధ్యప్రాచ్యం వరకు రాజుకుంటున్న మంటలు ఇప్పుడు సామాన్యుడి వంటింట్లో మండుతున్నాయి. ఈ తరుణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు దేశవ్యాప్తంగా ఆందోళనను, అప్రమత్తతను సూచిస్తోంది. బుధవారం కేవలం రెండు వాహనాలతోనే ప్రయాణించిన ప్రధాని మోదీ.. పొదుపుచేయాల్సిన తీవ్రతను కళ్ళముందుంచారు. దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉందని, కలిసికట్టుగానే దీనిని ఎదుర్కోవాలని తేల్చిచెప్పారు. ప్రళయం ముందు సీఎంలు, కేంద్రమంత్రులు, అధికారయంత్రాంగాలు తీసుకుంటున్న నిర్ణయాలు ఆర్థిక తుఫానును తట్టుకునేందుకు భారత్ నిర్మించుకుంటున్న రక్షణ కవచంగా నిపుణులు పేర్కొంటున్నారు. మోదీ పిలుపునిచ్చిన వెంటనే ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెంటనే ఆచరణలో పెట్టేశారు.

**కాన్వాయ్ కట్..**

**యోగి 'ప్రజా రవాణా' మంత్రం**

పాలకులు విలాసాలకు దూరంగా ఉంటేనే ప్రజలు క్రమశిక్షణతో ఉంటారని నమ్మిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, తన కాన్వాయ్‌ను 50 శాతానికి తగ్గించి సంచలనం సృష్టించారు. మిగతా 2లో

## తెలంగాణలో ఉబెర్ భారీ విస్తరణ

**సీఎం రేవంత్ రెడ్డితో ఉబెర్ సీఈవో దారా ఖోస్రోషాహి భేటీ**

హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణకు ఉబెర్ నిర్ణయం

అమెరికా బయట తొలి కార్యాలయం హైదరాబాద్ లోనే...

పార్కింగ్ రంగంలోకి రావాలని ఉబెర్‌కు సీఎం రేవంత్ సూచన

భారత్ ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ ఆఫీస్ ఏర్పాటుపై ఉబెర్ ఆసక్తి



**హైదరాబాద్, మహా**

ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబెర్ తెలంగాణలో తమ కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది ఈ మేరకు ఉబెర్ సీఈవో దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలో కంపెనీ విస్తరణ, నగరాల్లో పార్కింగ్ సమస్యలు, రాబోయే భారత్ ఫ్యూచర్ సిటీలో అవకాశాలపై కీలక చర్చలు జరిపారు. హైదరాబాద్‌లో తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను విస్తరిస్తున్నట్లు ఈ సందర్భంగా సీఎంకు దారా ఖోస్రోషాహి తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన మొట్టమొదటి సీఓఈ ఇదేనని, ప్రస్తుతం ఇక్కడ 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని, భవిష్యత్తులో దీనిని మరింతగా పెంచనున్నామని వివరించారు. ఈ సందర్భంగా నగరాల్లో, ముఖ్యంగా మెట్రో స్టేషన్ల వద్ద ఎదురవుతున్న పార్కింగ్ ఇబ్బందులను సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ఈవీ ఛార్జింగ్ స్టేషన్లతో కూడిన మల్టీలెవల్ పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉబెర్‌కు సూచించారు. పట్టణ రద్దీని తగ్గించేందుకు పార్కింగ్ నిర్వహణ రంగంలోకి ప్రవేశించే అవకాశాలపై అధ్యయనం చేయాలని కోరారు. సీఎం ప్రతిపాదనపై ఉబెర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చారు.

### ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ ఆఫీస్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 30వేల ఎకరాల భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు గురించి సీఎం రేవంత్ ఈ సందర్భంగా వారికి వివరించారు. ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ఆసక్తి చూపిన దారా ఖోస్రోషాహి, అక్కడ తమ కార్పొరేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, తమ భవిష్యత్ విస్తరణకు ప్రభుత్వ సహకారం కావాలని కోరారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబెర్ ఇండియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, సీటీఓ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారం రోజుల భారత పర్యటనలో భాగంగా ఖోస్రోషాహి పలువురు కేంద్ర, రాష్ట్ర నాయకులతో మొబిలిటీ, టెక్నాలజీ, పెట్టుబడులపై చర్చిస్తున్నారు. కాగా, పార్కింగ్ ప్రాజెక్టులు, కొత్త కార్పొరేట్ ఆఫీస్ ఏర్పాటుకు సంబంధించి నిర్దిష్ట కాలపరిమితులను ప్రకటించనప్పటికీ, తెలంగాణలో పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఇరు పక్షాలు అంగీకరించాయి.

## పోలీసుల విచారణకు బండి భగీరథ్ డుమ్మా

### 15న వస్తానని ఈ మెయిల్

మరిన్ని సెక్షన్ లను జోడించిన పోలీసులు

రెండవ సారి బాధితురాలి స్టేట్ మెంట్ రికార్డ్ చేసిన పోలీసులు

నేడు హైకోర్టులో భగీరథ్ పిటిషన్ పై విచారణకు అవకాశం

**హైదరాబాద్, మహా :** మైనర్ బాలికపై అత్యాచార ఆరోపణలను ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ఈ కేసును విచారిస్తోంది. ఇందులో భాగంగా విచారణకు రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పోలీసుల ముందు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే సమయం గడిచినప్పటికీ భగీరథ్ పోలీసుల విచారణకు హాజరుకాలేదు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పలు సెక్షన్లను పోలీసులు జోడించారు. బీఎన్ఎస్ 74, 75 తో పాటు సెక్షన్ 5 (i) రెడ్ విత్ 6



కింద కేసులు నమోదు చేశారు. బాధితురాలి నుంచి రెండో సారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. మిగతా 2లో

## గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్

ఇళ్లలో మూలుగుతున్న 34 వేల టన్నుల పసిడి బయటకు...

ఆర్థిక సంక్షోభానికి చెక్ పెట్టేలా కేంద్రం వ్యూహం


అమెరికా.. ఇరాన్ ఉద్రిక్తతల వేళ టెన్షన్ టెన్షన్

దిగుమతుల భారాన్ని దించేలా 'గోల్డ్ మెటల్ లోన్

**హైదరాబాద్, మహా:** అమెరికా-ఇరాన్ దేశాల మధ్య రగులుతున్న ఉద్రిక్తతల సెగ భారత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా తాకుతోంది. ఈ భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో దేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు (ఫారెక్స్ రిజర్వ్‌లు) ఆందోళనకర స్థాయిలో ఒడిదుడుకులకు గురవుతున్నాయి. ఈ ఆర్థిక విపత్తు నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు, విదేశీ కరెన్సీని ఆదా చేసేందుకుగాను ప్రజలు ఒక ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు ఆపేయాలని సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రధాని ఉద్దేశం దేశభక్తితో కూడినదైనప్పటికీ, ఈ నిర్ణయంపై జ్యువెలరీ పరిశ్రమ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. పసిడి కొనుగోళ్లు ఆగిపోతే ఏళ్ల తరబడి ఇదే వృత్తిని నమ్ముకున్న కోట్ల మంది




కార్మికుల జీవితాలు వీధిన పడతాయని హెచ్చరిస్తోంది. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో అటు దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకుంటూనే, ఇటు లక్షలాది కుటుంబాల మిగతా 2లో



## వృద్ధిలో భారత నగరాల జోరు

అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న నగరాల్లో 17 మనవే..

టాప్10లో సూరత్ నంబర్ వన్.. సత్తా చాటిన హైదరాబాద్, విజయవాడ

ఆక్స్ ఫర్డ్ ఎకనామిక్స్ సంచలన నివేదిక

**ఢిల్లీ, మహా:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం ఒక తిరుగులేని శక్తుగా ఎదుగుతుందనడానికి మరో బలమైన ఆధారం లభించింది. భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక వృద్ధికి కేంద్ర బిందువులుగా భారతీయ నగరాలే నిలవబోతున్నాయని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ తన తాజా పరిశోధనలో వెల్లడించింది. 2019 నుంచి 2035 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా వృద్ధి చెందే టాప్20 నగరాలను విశ్లేషించగా, అందులో ఏకంగా 17 నగరాలు భారతదేశానికి చెందినవే కావడం గమనార్హం. కేవలం మెట్రో నగరాలే కాకుండా, ద్వితీయ శ్రేణి నగరాలు సైతం ఈ రేసులో గ్లోబల్ నగరాలను వెనక్కి నెట్టి దూసుకుపోతుండటం నవ భారత ఆర్థిక విప్లవానికి సంకేతంగా నిలుస్తోంది. మిగతా 2లో

# రైతులకు కేంద్రం గుడ్ న్యూస్

## వరికి కనీస మద్దతు ధర పెంపు.. క్వింటాకు రూ.72 పెంచిన కేంద్రం

**ఢిల్లీ, మహా:** దేశవ్యాప్తంగా వానాకాలం (ఖరీఫ్) సాగు పనుల్లో నిమగ్నమైన అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాత్రింబవళ్లు మట్టితో మల్ల యుద్ధం చేస్తూ, దేశానికి అన్నం పెడుతున్న కర్షకుడి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కాలనే సదుద్దేశంతో.. ఏకంగా పద్నాలుగుకు పైగా ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరలను (ఎంఎస్‌పీ) చారిత్రాత్మక స్థాయిలో సవరిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. భారతీయుల ప్రధాన ఆహారమైన వరి సాగులో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా గోదావరి, కృష్ణా బేసిన్లలో పండే ధాన్యానికి దేశవ్యాప్తంగా విపరీతమైన డిమాండ్ ఉంది.



క్వింటా వరికి కనీస మద్దతు ధరను రూ.72 పెంచి రూ.2,441 చెల్లించాలని నిశ్చయించింది. క్వింటా జొన్న కనీస మద్దతు ధరను రూ.4,023కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో 'తెల్ల బంగారం'గా పిలుచుకునే పత్తి పంట సాగులో గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలు దేశానికి వెన్నెముకగా నిలుస్తున్నాయి. వాతావరణ ప్రతికూలతలను సైతం తట్టుకుని పత్తి పండించే ఈ రాష్ట్రాల రైతుల కోసం కనీవినీ ఎరుగని రీతిలో.. మధ్యరకం పత్తికి క్వింటాలుకు రూ.8,267, లాంగ్ స్టేపుల్ (పొడవు గింజ) పత్తికి ఏకంగా రూ.8,667 మద్దతు ధరను కేంద్రం ప్రకటించింది. దీనివల్ల కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోళ్ల ద్వారా రైతులకు నేరుగా ఆర్థిక భద్రత చేకూరుతుంది.

### పప్పుదినుసులు, చిరుధాన్యాలకు పెద్దపీట

దేశ ప్రజల ప్రోటీన్ల లోపాన్ని నివారించే పప్పు ధాన్యాల సాగును లాభసాటిగా మార్చేందుకు కేంద్రం వేసిన అడుగులు వర్షాధారిత ప్రాంతాల రైతులకు వరంలా మారాయి. కందులు, పెసర్లు, మినుములు వంటి పప్పు దినుసుల సాగులో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు సింహ భాగం ఆక్రమిస్తున్నాయి. ఈ రాష్ట్రాల రైతులను మరింత ప్రోత్సహించే దిశగా కందులకు క్వింటాలుకు రూ.8,450, పెసర్లకు గరిష్ఠంగా రూ.8,780, మినుములకు రూ.8,200 చొప్పున ఆకర్షణీయమైన మద్దతు ధరలను నిర్ణయించారు. దీనికి తోడు వాతావరణ మార్పులను తట్టుకుని, అతి తక్కువ నీటితో పెరిగే చిరుధాన్యాలైన సజ్జలను రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ అత్యధికంగా పండిస్తుండగా.. జొన్నల సాగులో మహారాష్ట్ర, కర్ణాటక ముందున్నాయి. ఈ రైతుల కష్టానికి గుర్తింపుగా హైబ్రిడ్ జొన్నలకు రూ.4,023, మల్దండి జొన్నలకు రూ.4,073, సజ్జలకు రూ.2,900 మద్దతు ధర లభించడం ఆయా రాష్ట్రాల డ్రైల్యాండ్ ఫార్మింగ్ స్వరూపాన్నే మార్చేయనుంది. వ్యవసాయ అనుబంధ పౌల్ట్రీ పరిశ్రమకు కీలకమైన మొక్కజొన్న (కర్ణాటక, మధ్యప్రదేశ్, తెలంగాణాల్లో అధికం) ధరను రూ.2,410కి పెంచడం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు సిరులు పండనున్నాయి.

### ఆత్మనిర్భర్ భారత్ దిశగా..

దేశంలో వంట నూనెల దిగుమతుల భారాన్ని తగ్గించి, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసే దిశగా నూనెగింజల మద్దతు ధరలను కేంద్రం అనూహ్యంగా పెంచడం వ్యవసాయ రంగంలో మరో చారిత్రాత్మక ఘట్టం. ఖరీఫ్ పంటలన్నింటిలోకెల్లా అత్యధికంగా నువ్వులకు క్వింటాలుకు రూ.10,346 ల రికార్డు ధరను ప్రకటించగా, ఇది ప్రధానంగా పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల రైతులకు కనకవర్షం కురిపించనుంది. అలాగే వేరుశనగ సాగులో అగ్రగామిగా ఉన్న గుజరాత్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రైతులకు లబ్ధి చేకూరుస్తూ క్వింటాలుకు రూ.7,517 ధరను నిర్ణయించారు. దేశంలోనే అత్యధికంగా సోయాబీన్ పండించే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర కర్షకులకు అండగా రూ.5,708 మద్దతు ధరను ఖరారు చేయడం, కర్ణాటక, ఒడిశాలో పండే పొద్దుతిరుగుడుకు రూ.8,343, ఒడిసలు పంటకు రూ.10,052 చొప్పున గిట్టుబాటు ధరలు కల్పించడం ద్వారా నూనెగింజల సాగు సరికొత్త పుంతలు తొక్కనుంది.

# గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్

(మొదటిపేజీ తరువాయి)

జీవనోపాధిని రక్షించే అద్భుత ప్రత్యామ్నాయంగా 'గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్' తెరపైకి వస్తోంది.

### 3.5 కోట్ల మంది ఉపాధిపై నీలినీడలు.. ఆందోళనలో పరిశ్రమ

బంగారం కొనవద్దని ప్రధాని చేసిన సూచన జ్యువెలరీ రంగాన్ని బెంబేలెత్తిస్తోంది. ఆల్ ఇండియా జ్యువెలర్స్ అండ్ గోల్డ్ స్మిత్ ఫెడరేషన్ తాజా అంచనాల ప్రకారం.. దేశవ్యాప్తంగా ఈ స్వర్ణకారుల పరిశ్రమపై ఆధారపడి సుమారు 3.5 కోట్ల మంది కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. ఏకబిగిన బంగారం కొనుగోళ్లు నిలిచిపోతే ఆభరణాల తయారీ రంగానికి ఆర్డర్లు ఆగిపోయి, ఈ 3.5 కోట్ల మంది ఉపాధి తీవ్ర ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఫెడరేషన్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. పసిడి పరిశ్రమ కుదేలైతే అది అంతిమంగా దేశీయ మార్కెట్ పైనే ప్రతికూల ప్రభావం చూపుతుందని, కాబట్టి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడానికి కొనుగోళ్లు ఆపడం కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని పరిశ్రమ పెద్దలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### ఆర్థిక సంక్షోభానికి బ్రహ్మాస్త్రం

ఈ క్లిష్ట తరుణంలో మోదీ ప్రభుత్వానికి 'గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్' ఒక సంజీవనిలా కనిపిస్తోంది. వాస్తవానికి ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2015లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. భారతీయ కుటుంబాల ఇళ్లలో, దేవాలయాల ట్రస్టుల్లో, వివిధ సంస్థల వద్ద నిరుపయోగంగా పడి ఉన్న బంగారాన్ని బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా దేశ ఆర్థిక వృద్ధిలోకి తీసుకురావడమే ఈ స్కీమ్ ప్రధాన లక్ష్యం.




ఒక అంచనా ప్రకారం ప్రస్తుతం భారతీయ ఇళ్లలో సుమారు 34,000 టన్నుల బంగారం లాకర్లకే పరిమితమై ఉంది. కానీ విచారకరమైన విషయం ఏమిటంటే.. ఈ పథకం కింద ఇప్పటివరకు కేవలం 39 టన్నుల బంగారం మాత్రమే డిపాజిట్ అయ్యింది. 2026 ఆర్థిక సంవత్సరంలోనే దేశంలో బంగారం దిగుమతులు ఏకంగా 24 శాతం పెరిగి, దేశ ఖజానాపై సుమారు 72 బిలియన్ డాలర్ల (లక్షల కోట్ల రూపాయల) విపరీతమైన భారం పడింది. ఈ నేపథ్యంలో ఈ స్కీమ్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చి పునరుద్ధరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

### ఈ పథకం ఎలా పనిచేస్తుందంటే

ఈ గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ వినియోగదారులకు ఎంతో లాభదాయకమైనది. ప్రజలు తమ ఇళ్లలో వాడకుండా ఉన్న పసిడిని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ గుర్తింపు పొందిన నిర్దేశిత కేంద్రాల్లో సురక్షితంగా డిపాజిట్ చేసుకోవచ్చు. ఆ బంగారాన్ని తీసుకుని బ్యాంకులు వినియోగదారులకు అధికారిక 'డిపాజిట్ సర్టిఫికెట్ల'ను అందజేస్తాయి. వినియోగదారుల వీలును బట్టి స్వల్పకాలిక (1 నుంచి 3 ఏళ్లు), మధ్యకాలిక (5 నుంచి 7 ఏళ్లు), దీర్ఘకాలిక (12 నుంచి 15 ఏళ్లు) ప్రాతిపదికన ఈ డిపాజిట్లను స్వీకరిస్తారు. లాకర్లలో పెడితే ఎలాంటి ఆదాయం రాకపోగా నిర్వహణ ఛార్జీలు పడతాయి, కానీ ఈ స్కీమ్‌లో పెడితే బ్యాంకులు లేదా ప్రభుత్వం నిర్ణయించిన వడ్డీ కూడా అదనపు ఆదాయంగా సమకూరుతుంది. ప్రస్తుతం ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ వంటి దేశంలోని ప్రధాన బ్యాంకులన్నీ ఈ సేవలను అత్యంత పారదర్శకంగా అందిస్తున్నాయి.

### ఆభరణాల రంగానికి ఊపిరి.. 'గోల్డ్ మెటల్ లోన్'

ఈ పథకం కేవలం సామాన్యులకే కాకుండా ఆభరణాల తయారీదారులకు కూడా 'గోల్డ్ మెటల్ లోన్' రూపంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రజల నుంచి ఈ స్కీమ్ కింద సేకరించిన బంగారాన్ని బ్యాంకులు నేరుగా జ్యువెలరీ తయారీదారులకు రుణంగా అందిస్తాయి. దీంతో స్వర్ణకారులు, వ్యాపారులు నగదు రూపంలో కాకుండా నేరుగా బంగారాన్నే రుణంగా పొందే అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఈ రుణాలకు సంబంధించి గరిష్ఠ కాలపరిమితి 180 రోజులుగా నిర్ణయించారు. దీనివల్ల ప్రధాని కోరుకున్నట్లు విదేశాల నుంచి పసిడి దిగుమతులు తగ్గిపోయి వేల కోట్ల విదేశీ కరెన్సీ ఆదా అవుతుంది. అదే సమయంలో స్థానికంగానే పసిడి అందుబాటులోకి రావడంతో ఆభరణాల రంగం సంక్షోభం నుంచి బయటపడి, కోట్ల మంది కార్మికుల ఉపాధి కూడా సురక్షితంగా ఉంటుంది. దేశ ప్రజలంతా స్వచ్ఛందంగా ఈ పథకంలో భాగస్వాములైతే భారత దేశ ఆర్థిక స్వరూపమే మారిపోతుందని ఆర్థిక విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

# విశ్వాసం విజయ్ పైనే...

## 144 ఓట్లతో గట్టెక్కిన టీవీకే సర్కార్!

### అన్నాడీఎంకే లో మేజర్ చీలిక.. విజయ్ కే సపోర్ట్

### ఐదేళ్ళ సుస్థిర పాలన అందిస్తామని సీఎం ప్రకటన

(మొదటిపేజీ తరువాయి)

అగ్నిపరీక్షలో గట్టెక్కింది. గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ విధించిన మే 13వ తేదీ గడువులోపే బుధవారం నిర్వహించిన విశ్వాస పరీక్షలో విజయ్ ప్రభుత్వం పాసైంది. రాజకీయ ఉత్కంఠ మధ్య జరిగిన ఈ ఫ్లోర్ టెస్ట్‌లో విజయ్ సర్కార్‌కు అనుకూలంగా 144 ఓట్లు రాగా, వ్యతిరేకంగా కేవలం 22 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ప్రధాన ప్రతిపక్షం డీఎంకే సభ నుంచి వాకౌట్ చేయగా, అన్నాడీఎంకే రెండు వర్గాలుగా చీలిపోవడం, బీజేపీ, పీఎంకేలు తటస్థంగా ఉండటం ఈ బలపరీక్షలో విశేషంగా నిలిచింది. స్పీకర్ జేసీడీ ప్రభాకర్ ఫలితాలను అధికారికంగా ప్రకటిస్తూ విజయ్ ప్రభుత్వం మెజారిటీని నిరూపించుకున్నట్లు వెల్లడించారు.

### ఆసక్తికరంగా ఫ్లోర్ టెస్ట్

తమిళనాడు అసెంబ్లీలో బుధవారం ఉదయం నుంచే రాజకీయ వేడి రాజుకుంది. గవర్నర్ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి విజయ్ స్వయంగా విశ్వాస పరీక్ష తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన సుదీర్ఘ చర్చలో వివిధ పార్టీల సభ్యులు తమ గళాన్ని వినిపించారు. కాంగ్రెస్ పార్టీ సభ్యులు అనూహ్యంగా విజయ్‌కు పూర్తి మద్దతు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకున్న తొలి మూడు నిర్ణయాలు ప్రజాహితంగా ఉన్నాయంటూ వారు ప్రశంసల వర్షం కురిపించారు. ఆ తర్వాత వామపక్ష పార్టీలైన సీపీఐ, సీపీఎం కూడా టీవీకే ప్రభుత్వానికి అండగా నిలిచాయి. రాష్ట్రంలో గవర్నర్ పాలనను అడ్డుకోవాలని, కేంద్రం రాష్ట్ర హక్కులను కాలరాస్తోందని పేర్కొంటూ విజయ్‌కు మద్దతు పలకడం గమనార్హం. విడుదలై చిరుతైగల్ కట్చి కూడా మద్దతు ప్రకటించినప్పటికీ, సీఎం ఓఎస్డీగా ఒక వ్యక్తిగత జ్యోతిష్యుడిని నియమించడంపై సున్నితంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. పాలనలో విజ్ఞాన శాస్త్రానికి, హేతువాదానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రికి సూచించింది. ఏఎంఎంకే బహిష్కృత ఎమ్మెల్యే కామరాజు, డీఎండీకే ఏకైక ఎమ్మెల్యే కూడా విజయ్‌కు అనుకూలంగా ఓటు వేశారు. అయితే, సభలో ప్రధాన ప్రతిపక్షం డీఎంకే మాత్రం విజయ్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. డీఎంకే యువనేత ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ, విజయ్ ఇప్పటికే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని, 65 శాతం మంది ఓటర్లు ఆయనకు వ్యతిరేకంగా ఉన్నారని ఘాటుగా విమర్శించారు. పళనిస్వామి వర్గం విజయ్‌కు వ్యతిరేకంగా ఓటు వేయగా, షణ్ముగం వర్గానికి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. విజయ్ తమ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టారని పళనిస్వామి ఆరోపించగా, షణ్ముగం వర్గం ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. బీజేపీ మరియు అన్బుమణి రామదాస్ నేతృత్వంలోని పీఎంకే పార్టీలు ఈ ఓటింగ్‌లో తటస్థంగా ఉండిపోయాయి. బలపరీక్షలో ఘన విజయం సాధించిన అనంతరం ముఖ్యమంత్రి విజయ్ భావోద్వేగంతో ప్రసంగించారు. తనకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రభుత్వం సంపూర్ణ లౌకిక విధానాన్ని అవలంబిస్తుందని, ఐదేళ్ల సుస్థిర పాలనను అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన ప్రజాపయోగకరమైన హామీలను కూడా తాము కొనసాగిస్తామని, ఈ ప్రభుత్వం తనకు ఓటు వేసిన వారితో పాటు వేయని వారిది కూడా అని ఆయన ప్రకటించారు. కేవలం మెజారిటీ నిరూపించుకోవడమే కాకుండా, ప్రజా విశ్వాసాన్ని గెలుచుకోవడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

# దేశం క్లిష్ట పరిస్థితుల్లో.. ప్రళయానికి ముందు ప్రశాంతత?

(మొదటిపేజీ తరువాయి)

వారానికి ఒకరోజు వాహన రహిత దినోత్సవం: మంత్రులు, అధికారులు సైతం బస్సులు, మెట్రోల్లో ప్రయాణించాలనే నిబంధన. ఇంధనంతో పాటు విద్యుత్ ఆదా కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల నియంత్రణ చేయనున్నారు.

### 40 దేశాల్లో ఇప్పటికే అమలు

చమురు సంక్షోభం, యుద్ధాల ప్రభావం, డాలర్ ఒత్తిడి, పెరుగుతున్న ఇంధన ధరలు.. ప్రపంచ దేశాలన్నింటినీ ఒక్కసారిగా అప్రమత్తం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన "పొదుపు - నియంత్రణ - స్వావలంబన" పిలుపు ఇప్పుడు అంతర్జాతీయ ధోరణికే ప్రతిబింబంగా కనిపిస్తోంది. కొందరు రాజకీయంగా విమర్శిస్తున్నా.. వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు ప్రజలను వినియోగం తగ్గించండి, ఇంధనం ఆదా చేయండి, అనవసర ప్రయాణాలు తగ్గించండి అంటూ హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా దేశాలు ఇంధన పొదుపు కోసం అత్యవసర చర్యలు ప్రారంభించాయి. కొన్నిచోట్ల వారానికి నాలుగు రోజులే పని విధానం అమలు చేస్తున్నారు. మరికొన్ని దేశాలు ప్రభుత్వ ఉద్యోగులకు తప్పనిసరి వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేస్తున్నాయి. కొన్ని దేశాలు అయితే పెట్రోల్ రేషన్ విధానం, ఆడ్‌ఈవెన్ డ్రైవింగ్ రూల్స్, రాత్రి మార్కెట్లు ముందుగానే మూసివేత, ప్రభుత్వ ప్రయాణాలపై ఆంక్షలు వంటి కఠిన నిర్ణయాల దాకా వెళ్లాయి. పాకిస్తాన్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు 50 శాతం రిమోట్ విధానం అమలు చేస్తున్నారు. శ్రీలంకలో బుధవారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. బంగ్లాదేశ్‌లో విద్యుత్ ఆదా కోసం యూనివర్సిటీలకు సెలవులు ఇచ్చారు. ఇండోనేషియా, థాయ్‌లాండ్, మలేషియా వంటి దేశాలు వర్క్ ఫ్రమ్ హోమ్‌ను ప్రోత్సహిస్తున్నాయి. దక్షిణ కొరియాలో ప్రభుత్వ ఉద్యోగులకు ఆడ్‌ఈవెన్ వాహన వినియోగ నిబంధనలు అమల్లో ఉన్నాయి.

### వర్క్ ఫ్రమ్ హోమ్ 2.0

ఒకప్పుడు కరోనా వల్ల వచ్చిన 'వర్క్ ఫ్రమ్ హోమ్' సంస్కృతి, ఇప్పుడు 'ఇంధన పొదుపు' కోసం తిరిగి రాబోతోంది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం భవిష్యత్తు అంతా డిజిటల్ వర్క్ ఫోర్స్ దే అని సంకేతాలిస్తున్నారు. ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేయడం వల్ల రోడ్లపై లక్షలాది లీటర్ల పెట్రోల్ ఆదా అవుతుంది. మనం ఆదా చేసే ప్రతి చుక్క పెట్రోల్.. దేశం నుంచి బయటకు వెళ్లే డాలర్లను అరికడుతుంది.

### గ్లోబల్ అలర్ట్

భారత్ తీసుకుంటున్న ఈ చర్యలు వివిక్తమైనవి కావు. ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా దేశాలు ఇప్పటికే 'ఎమర్జెన్సీ మోడ్'లోకి వెళ్లాయి. శ్రీలంక, పాకిస్థాన్: ఇప్పటికే ఇంధన లేమితో అల్లాడుతూ కఠిన ఆంక్షలు విధించాయి. ఐరోపా దేశాలు: విద్యుత్ ఆదా కోసం రాత్రిపూట వీధి దీపాలు, వాణిజ్య ప్రకటనల బోర్డులను సైతం నిలిపివేస్తున్నాయి. బంగారం వద్దు స్థానిక ఉత్పత్తులే ముద్దు: విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకోవడానికి బంగారం దిగుమతులు తగ్గించి, 'లోకల్' వస్తువులకే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాని కోరుతున్నారు. రాబోయే ఐదేళ్లలో మన జీవనశైలిలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. పెట్రోల్ బంకుల కంటే ఎక్కువ విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు కనిపిస్తాయి. ఆఫీసులన్నీ ఒకే సమయానికి కాకుండా, ట్రాఫిక్ రద్దీని బట్టి వేర్వేరు సమయాల్లో పనిచేస్తాయి. మీ సేవలు, ప్రభుత్వ పనులన్నీ ఇంటి నుంచే పూర్తి చేసుకునేలా హైటెక్ వ్యవస్థలు అందుబాటులోకి వస్తాయి.



# కేరళ సస్పెన్స్ కథాచిత్రం

**ఢిల్లీ, మహా :** కేరళ ముఖ్యమంత్రి ఎంపికపై కాంగ్రెస్ హైకమాండ్ మల్లాగుల్లాలు పడుతోంది. ఫలితాలు విడుదలై దాదాపు పది రోజులు కావొస్తున్నా సీఎంను ఎంపిక చేయడంలో ఒక నిర్ణయానికి రాలేకపోతోంది. సీఎం విషయమై చర్చించేందుకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లారు. దాదాపు 40 నిమిషాలు వీరిద్దరి మధ్య చర్చలు జరిగినా ముఖ్యమంత్రి పేరును ఖరారు చేయలేదు. అయితే గురువారం కేరళ సీఎం పేరును ప్రకటిస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. సీఎల్పీ తీర్మానం మేరకు అధిష్ఠానం అందరితో చర్చలు జరిపి ఒక నిర్ణయానికి వచ్చిందని వెల్లడించారు. మరోవైపు ముఖ్యమంత్రి ఎంపికపై కాంగ్రెస్ అధిష్ఠానం జాప్యాన్ని నిరసిస్తూ రాహుల్, ప్రియాంకలకు వ్యతిరేకంగా వయనాడ్‌లోని కాంగ్రెస్ కార్యాలయం బయట కొందరు పోస్టర్లు అంటించారు. సీఎం ఎంపికపై జాప్యాన్ని ఇలాగే కొనసాగిస్తే వయనాడ్ నుంచి మరోసారి గెలవలేరని హెచ్చరించారు. కేసీ వేణుగోపాల్‌ను సీఎంగా ఖరారు చేస్తే కేరళ ప్రజలు ఎప్పటికీ క్షమించరని తెలిపారు. ఎమ్మెల్యేలు కేసీ వేణుగోపాల్ ను కోరుకుంటుండగా, గ్రౌండ్ లోని క్యాడర్, మిత్రపక్షాలు వీడీ సతీషన్ ను సీఎంగా కోరుకుంటున్నాయి. హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆసక్తినెలకొంది.

# వృద్ధిలో భారత నగరాల జోరు

## అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న నగరాల్లో 17 మనవే...

### టాప్10లో సూరత్ నంబర్ వన్.. సత్తా చాటిన హైదరాబాద్, విజయవాడ

### ఆక్స్ ఫర్డ్ ఎకనామిక్స్ సంచలన నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

### ప్రపంచ నంబర్ వన్‌గా సూరత్

ఆక్స్ ఫర్డ్ ఎకనామిక్స్ నివేదిక ప్రకారం, 2035 నాటికి ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందే నగరంగా గుజరాత్‌లోని సూరత్ నిలవబోతోంది. వార్షిక సగటు జిడిపి వృద్ధి రేటులో 9.17 శాతం సాధించి సూరత్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. వజ్రాల పరిశ్రమ మరియు టెక్స్‌టైల్ రంగంలో ఉన్న పట్టు ఈ నగర వృద్ధికి ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. సూరత్ తర్వాత వరుసగా ఆగ్రా (8.58 శాతం), బెంగళూరు (8.50 శాతం) రెండు మరియు మూడు స్థానాలను దక్కించుకున్నాయి. టాప్10 నగరాల జాబితాను పరిశీలిస్తే, అందులో పదికి పది నగరాలు భారతదేశానివే కావడం ప్రపంచ వేదికపై మన దేశ ప్రాధాన్యతను చాటుతోంది. మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామికీకరణ మరియు స్టార్టప్ సంస్కృతి భారత పట్టణాలను వృద్ధి పథంలో నడిపిస్తున్నాయి.

### హైదరాబాద్, విజయవాడ జోరు

తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, భాగ్యనగరం హైదరాబాద్ మరియు ఆంధ్రప్రదేశ్ వాణిజ్య రాజధాని విజయవాడలు ఈ ప్రతిష్టాత్మక జాబితాలో చోటు సంపాదించి తమ సత్తా చాటాయి. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు గ్లోబల్ హబ్‌గా మారిన హైదరాబాద్ 8.47 శాతం వృద్ధి రేటుతో ప్రపంచంలోనే నాలుగో స్థానంలో నిలిచింది. ఒకప్పుడు కేవలం ఐటీకే పరిమితమైన హైదరాబాద్, నేడు రియల్ ఎస్టేట్ మరియు మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో కూడా అద్భుతమైన పురోగతిని సాధిస్తోంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నగరం 8.16 శాతం వృద్ధి రేటుతో టాప్ 10లో స్థానం సంపాదించింది. వ్యవసాయ అనుబంధ



పరిశ్రమలు, రవాణా మరియు పెరుగుతున్న వాణిజ్య కార్యకలాపాలు విజయవాడను ప్రపంచ స్థాయి వృద్ధి నగరాల సరసన నిలబెట్టాయి.

### దక్షిణాది రాష్ట్రాల ఆధిపత్యం..

ఈ నివేదికలో మరో విశేషం ఏమిటంటే, టాప్10 నగరాల్లో సగానికి పైగా అంటే ఆరు నగరాలు దక్షిణాది రాష్ట్రాల నుంచే ఉండటం. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి మెట్రోలతో పాటు తిరుప్పూర్, తిరుచిరాపల్లి మరియు విజయవాడ వంటి నగరాలు ఈ జాబితాలో ఉన్నాయి. తమిళనాడులోని తిరుప్పూర్ (8.36 శాతం), తిరుచిరాపల్లి (8.29 శాతం) మరియు చెన్నై (8.17 శాతం) నగరాలు వరుసగా 6, 8, 9 స్థానాల్లో నిలిచాయి. మహారాష్ట్ర నుంచి నాగ్‌పూర్ (8.41 శాతం) ఐదో స్థానంలో, గుజరాత్ నుంచి రాజ్‌కోట్ (8.33 శాతం) ఏడో స్థానంలో ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లో ఉన్న భౌగోళిక అనుకూలతలు, స్థానిక ప్రభుత్వాల ప్రోత్సాహం మరియు యువతకు ఉన్న ఉపాధి అవకాశాలు ఈ పట్టణాలను ఆర్థిక శక్తి కేంద్రాలుగా మారుస్తున్నాయి.

### పట్టణీకరణే కీలక ఆదాయం

2035 నాటికి ప్రపంచ జిడిపిలో అత్యధిక వాటాను భారత నగరాలే సమకూర్చబోతున్నాయని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ స్థాయి వృద్ధి వల్ల రాబోయే పదేళ్లలో ఈ నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రవాణా వ్యవస్థ మెరుగుదల మరియు రియల్ ఎస్టేట్ రంగంలో భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. పట్టణీకరణ వేగవంతం కావడం వల్ల కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయి, తద్వారా సామాన్యుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. భారత నగరాలు కేవలం జనాభాతో మాత్రమే కాకుండా, అపారమైన ఆర్థిక సంపదతో కూడా ప్రపంచాన్ని శాసించబోతున్నాయని ఈ నివేదిక నిరూపిస్తోంది.

# పోలీసుల విచారణకు బండి భగీరథ్ డుమ్మా

(మొదటిపేజీ తరువాయి)

తాజాగా నిందితుడిపై తీవ్రమైన లైంగిక దాడి, ముందుగా ప్లాన్ చేసి లైంగిక చర్యలకు పాల్పడినట్లు సెక్షన్ 5 (i)ను కూడా పోలీసులు జతపరిచారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టులో బండి భగీరథ్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు వెకేషన్ బెంచ్ నేడు విచారణ చేపట్టనుంది. నిర్ణీత సమయానికి భగీరథ్ పోలీసుల ముందుకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. నోటీసులు ఇచ్చినప్పటికీ భగీరథ్ హాజరుకాకపోవడంతో పోలీసులు తదుపరి ఏ విధంగా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. మరోసారి నోటీసులు జారీ చేస్తారా లేదా చట్టపరంగా ఇతర చర్యలు తీసుకుంటారా అనేది వేచి చూడాలి. కేంద్రమంత్రి కుమారుడు కావడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఈ అంశం పెను సంచలనం సృష్టిస్తోంది. మరోవైపు పోలీసుల అరెస్టు నుంచి తప్పించుకునేందుకు భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన ఎఫ్.ఐ.ఆర్ ను కొట్టివేయాలని, లేదా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ వేశారు. ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని, సమగ్ర విచారణ కోసం కుకట్‌పల్లి డీసీపీ రీతిరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

### హైదరాబాద్ లో వెలసిన పోస్టర్లు

పోక్సో కేసు విచారణను ఎదుర్కొంటున్న బండి భగీరథ్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు కావడంతో రాజకీయంగా ప్రకంపనలను సృష్టిస్తోంది. భగీరథ్ కనిపించడం లేదంటూ హైదరాబాద్ లో పోస్టర్లు వెలిశాయి. మరో వైపు కొంత మంది మెట్రో రైలులో భగీరథ్ కనిపించడం లేదంటూ మీకేమైనా తెలుసా అంటూ ప్రచారం చేస్తూ తిరగడం కలకలం రేకెత్తిస్తోంది. కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో భగీరథ్ ను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ రెండు మూడు రోజులుగా బీఆర్ఎస్ నేతలు తప్పుపడుతున్నారు.

### పోలీసులకు ఈ మెయిల్ పంపిన భగీరథ్

తనపై నమోదైన పోక్సో కేసు విచారణకు పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరిస్తానని, విచారణను ఎదుర్కొనేందుకు 15 వ తేదీన వస్తానని పేర్కొంటూ భగీరథ్ పోలీసులకు ఈ మెయిల్ లేఖ పంపారు. తనపైనా, తన కుటుంబంపైనా లేనిపోని అబాండాలు వేస్తున్నారని పేర్కొన్న భగీరథ్ కేసు విచారణను పూర్తి స్థాయిలో న్యాయపరంగా ఎదుర్కొంటానని, కేసులో పోలీసులకు పూర్తి సహకరిస్తానని పేర్కొన్నారు. తనకు 12 న తేదీన పోలీసులు నోటీసులు జారీ చేశారని, కేవలం రెండు రోజులు గడువును మాత్రమే కోరుతున్నానని లేఖలో తెలిపారు.




### ఏ క్షణమైనా పెట్రోల్, డీజిల్ ధరలు

# పెరిగే ఛాన్స్

### ఆర్బీఐ గవర్నర్

**ఢిల్లీ, మహా:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలై ఇప్పటికే సుమారు 75 రోజులు అయ్యింది. ఇప్పటి వరకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగినప్పటికీ ప్రభుత్వమే వాటిని భరిస్తూ వచ్చిది. అయితే, యుద్ధం ఇలానే కొనసాగితే ధరలు ఏ క్షణమైనా పెంచే అవకాశం ఉంది. అని ఆర్ బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంచలన ప్రకటన చేశారు. భారతదేశ మొత్తం దిగుమతులలో ఆరో వంతు ఆ ప్రాంతం నుంచే వస్తుండగా, ఎగుమతులలో ఆరో వంతు అక్కడికే వెళ్తున్నాయని ఆయన చెప్పారు. దీనికి తోడు, విదేశాల నుంచి వచ్చే నిధులలో దాదాపు 40 శాతం, ఎరువుల దిగుమతులలో 40 శాతం, గ్యాస్ సరఫరాలో దాదాపు 60 శాతం ఆ ప్రాంతంతోనే ముడిపడి ఉన్నాయని, ఇది ఆ ప్రాంత పరిణామాలకు భారతదేశాన్ని ఎంతగానో గురిచేస్తుందని వివరించారు. ఇటువంటి వాతావరణంలో, వేగంగా మారుతున్న అంతర్జాతీయ, దేశీయ పరిస్థితులకు అనుగుణంగా ద్రవ్య విధానం అత్యంత అనువైనదిగా, చురుకైనదిగా, వేగవంతమైనదిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.







## భర్తతో విడిపోతున్నట్లు రూమర్స్..
# నటి ఏమందంటే?

బాలీవుడ్ ప్రముఖ హీరోయిన్ మౌనీరాయ్ విడాకులు తీసుకోందని వార్తలు వినిపిస్తున్నాయి. భర్త సూరజ్ నంబియార్‌ని ఇన్ స్టాలో అన్ ఫాలో చేయడమే దీనికి కారణం. ఇప్పటికీ వీళ్లిద్దరూ విడివిడిగా ఉంటున్నారని, విడాకుల తతంగం కూడా పూర్తయిందని టాక్ వినిపిస్తుంది. ఈ క్రమంలోనే తనపై వస్తున్న పుకార్లపై మౌనీ స్పందించింది. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. 'మీడియా వాళ్లకు విజ్ఞప్తి. అవాస్తవాలని ప్రచారం చేయొద్దు. మాకు కాస్త ప్రైవసీ ఇవ్వండి ప్లీజ్' అని మౌనీరాయ్.. తన ఇన్ స్టా స్టోరీలో రాసుకొచ్చింది.

మరి విడాకుల వార్తల్లో నిజానిజాలేంటి అనేది త్వరలో స్పష్టత వచ్చే అవకాశముంది. 2018లో దుబాయిలో కలుసుకున్న సూరజ్‌మౌనీరాయ్ నాలుగేళ్ల పాటు ప్రేమించుకున్నారు. పెద్దల్ని ఒప్పించి 2022లో గోవా వేదికగా పెళ్లి చేసుకున్నారు. మలయాళీబెంగాలీ సంప్రదాయ పద్ధతుల్లో ఈ వేడుక జరిగింది. సూరజ్, దుబాయికి చెందిన బిజినెస్‌మ్యాన్ కాగా మౌనీ, హిందీదక్షిణాది చిత్రాల్లో హీరోయిన్, నటిగా కనిపిస్తూనే స్పెషల్ సాంగ్స్ కూడా చేసింది. లేటెస్ట్‌గా అయితే చిరు 'విశ్వంభర'లోనూ ఐటమ్ సాంగ్ చేసింది.

## పూజా హెగ్డే అందాల అస్త్రం..

ఎవరేమనుకున్నా కథానాయికల్లో 99 శాతం మంది గ్లామర్ తోనే గుర్తింపు పొందాలని భావిస్తారు. అవకాశాల వేటకు గ్లామరస్ ఫొటోలనే వాడుతుంటారు. ఇందుకు నటి పూజా హెగ్డే అతీతం కాదనే సాహసం ఎవరు చేయలేరు. అందాల పోటీల్లో పాల్గొని ఆ తరువాత సినీ రంగ ప్రవేశం చేసిన బ్యూటీ ఈమె. 2012 లో ముఖముడి అనే చిత్రం ద్వారా కోలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయం అయ్యారు. ఆ చిత్రం విజయం సాధించకపోయినా, ఈ అమ్మడి పేరు వెలుగులోకి వచ్చింది. అలా టాలీవుడ్ లో అవకాశాలు అందుకున్నారు. అక్కడ మొదట్లో యువ హీరోలతో జత కట్టి, ఆ తరువాత మహేష్ బాబు, అల్లు అర్జున్, ప్రభాస్ వంటి ప్రముఖ హీరోలతో నటించి స్టార్‌డమ్‌ను పొందారు. అయితే ఆ మధ్య పూజా హెగ్డే నటించిన చిత్రాలు వరుసగా ఫ్లాప్ కావడంతో అక్కడ డిమాండ్ తగ్గింది. అదే విధంగా హిందీలో నటించిన చిత్రాలేవీ సక్సెస్ కాలేదు. కోలీవుడ్లోనూ ఈ భామకు అదే పరిస్థితి. ప్రస్తుతం చేతిలో ఒకటి రెండు చిత్రాలే ఉన్నాయి. దీంతో అవకాశాల వేటలో పడ్డారు. అందులో భాగంగా తన ఆదిలో తీసుకున్న గ్లామరస్ ఫొటోలను తన ఇన్ స్ట్రాగామ్‌లో పోస్ట్ చేశారు. అవి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అంతే కాదు నెటిజన్ల విమర్శలను గట్టిగానే ఎదుర్కొంటున్నాయి. ఇంతకు రెట్రో వంటి చిత్రాల్లో నటించిన పూజాహెగ్డే నేనా ఈమె అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరికొంతమంది 'పూజాహెగ్డే కాస్తయినా సంసార పక్షంగా కనిపించేది ఇక్కడేననీ(సౌత్ సినిమాల్లో), బాలీవుడ్‌లో అయితే వేరే లెవెల్ అంటూ తన ఎక్స్‌ఫోజింగ్ ఫొటోల గురించి చాలా బోల్డ్‌గా పేర్కొన్నారు.

## సాగర కన్యను తలపించిన ఊర్వశి

ఫ్రాన్స్‌లో జరుగుతున్న కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ దేశ, విదేశీ తారల తళుకులతో కనువిందుగా సాగుతోంది. మంగళవారం ఆరంభమైన ఈ ఫెస్టివల్ ఈ నెల 23తో ముగుస్తుంది. తొలి రోజు రెడ్ కార్పెట్‌పై పీచ్ కలర్ ఫ్రాక్‌లో తళుకులీనారు ఆలియా భట్. అయితే ఆలియా చేసిన కొన్ని వ్యాఖ్యలు విమర్శలకు దారి తీశాయి. ''సినిమాల్లో లీడ్ రోల్స్‌లో ఎవరు నటిస్తారు? అనేది ప్రేక్షకులు చూడరు. వాళ్లకి కథ ముఖ్యం'' అని పేర్కొనడంతో పాటు ఆలియా ఈ ఫెస్టివల్‌లో ఇంకా మాట్లాడుతూ - ''బార్బీ'లాంటి మహిళా ప్రాధాన్యం ఉన్న చిత్రాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభిస్తోంది. అయితే భారత్‌లో మాత్రం 75 శాతం సినిమాలు మాస్ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకునే రూపొందిస్తారు. అవన్నీ హీరో ప్రాధాన్యంగా సాగే సినిమాలే. అలాంటి సినిమాలు తీయొద్దని అనడంలేదు.

కానీ మహిళల కోసమూ సినిమాలు తీయాలి కదా. మహిళా ప్రేక్షకులకు కావాల్సిన సినిమాలు ఎవరు తీస్తారు? ఎందుకంటే సినిమాలు ఒక వర్గానికి మాత్రమే కాదు. అందరి కోసం తీయాలి'' అన్నారు. సినిమా పరిశ్రమలో పురుషాధిక్యతను ఉద్దేశించి ఆలియా ఈ వ్యాఖ్యలు చేశారని ఊహించవచ్చు. అయితే రెడ్ కార్పెట్‌పై ఆలియా అందానికి ప్రశంసలు కురిపించిన పలువురు నెటిజన్లు ఈ వ్యాఖ్యలను మాత్రం విమర్శిస్తున్నారు. ''ఒకవైపు భర్త (రణ్‌బీర్ కపూర్) 'యానిమల్' లాంటి వయొలెంట్ సినిమాలో నటించాడు. ఆ సినిమాలో హింస ఎక్కువగా ఉందని విమర్శలు వచ్చినా 'యానిమల్'ని సమర్థించింది. అలాగే 'ధురంధర్' సినిమా గురించి కూడా పెదవి విప్పలేదు. అలాంటి ఆలియా కాన్స్‌లో మహిళల కోసం సినిమాలు రావాలని మాట్లాడటం ఎందుకు?'' అంటూ విమర్శించారు.

### నేను ఊర్వశిని కాదు... భారతదేశాన్ని!

''నా దేశం తరపున ప్రాతినిధ్యం వహించిన ప్రతిసారీ 'నేను ఊర్వశిని కాదు... భారతదేశాన్ని! కాన్స్ ఫెస్టివల్ ప్రారంభ వేడుకలో నా భారతదేశం తరపున నేను ప్రాతినిధ్యం వహించడం నాకు చాలా ఆనందంగా ఉంది. వియత్నాంకు చెందిన ఫ్యాషల్ లేబుల్ జోలీ పోలీ కోచర్ డిజైన్ చేసిన ఈ బ్యూటిఫుల్ గౌనుని ధరించాను'' అని ఊర్వశీ రౌతేలా పేర్కొన్నారు. ఊర్వశి ధరించిన వెండి ఎంబ్రాయిడరీతో, క్రిస్టల్స్, పూసల వర్క్‌తో డిజైన్ చేసిన సిల్వర్ కలర్ ఫ్రాక్ అందర్నీ ఆకట్టుకుంది. అలాగే చోకర్ నెక్లెస్, భారీ ఇయర్ రింగ్స్, బ్రేస్‌లెట్, కేశాలంకరణలో పక్షి ఆకారంలో ఉన్న ఆభరణం, చేత్తో పట్టుకున్న అద్దాలు, రంగుల రాళ్లు పొదిగిన క్లచ్... వంటివన్నీ కూడా చాలా ఆకర్షణీయంగా ఉన్నాయనే అభినందనలు దక్కించుకున్నాయి. ఊర్వశి సాగర కన్యలా ఉందని పలువురు అభినందించారు. ఊర్వశి గౌను, ఆభరణాలు, బ్యాగు విలువ ఫ్యాషన్ నిపుణుల అంచనా ప్రకారం దాదాపు 155.87 మిలియన్ డాలర్లు అట. భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ. 1500 కోట్లు. వీటిని తయారు చేయడానికి 8 నెలలు పట్టిందట. ఇప్పటివరకూ ఊర్వశి పాల్గొన్న కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనే అత్యంత ఖరీదైనది ఇదే అని ఫ్యాషన్ నిపుణులు అంటున్నారు.

## 'పెద్ది'లో ఆటే కాదు.. అసలు కథే వేరే!

టాలీవుడ్ బాక్సాఫీస్ గత కొంతకాలంగా డల్ అయిపోయింది. చాలా వారాలుగా పెద్ద సినిమాలేవి విడుదల కావడం లేదు. చిన్న చిత్రాలేవి ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. దీంతో థియేటర్స్ దగ్గర సందడే కనిపించడం లేదు. మళ్లీ ఆ సందడి రావాలంటే ఓ భారీ చిత్రం రావాలి.. సూపర్ హిట్ కొట్టాలి. అందుకే ఇప్పుడు అందరి చూపులు 'పెద్ది'వైపు ఉన్నాయి. చాలా రోజుల తర్వాత తెలుగు నుంచి విడుదల అవుతున్న పాన్ ఇండియా చిత్రం ఇది. జూన్ 4న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతుంది. ఒక్క రోజు ముందే అంటే జూన్ 3నే ప్రీమియర్లతో పెద్ది సందడి మొదలవుంది. ఇప్పటికే ప్రమోషన్స్ మొదలయ్యాయి. వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. మే 18న ట్రైలర్ రిలీజ్ చేస్తారు. ఆ తర్వాత రామ్ చరణ్ కూడా ప్రమోషన్లలో పాల్గొంటాడు. ఇలా నెల మొత్తం ఇండస్ట్రీలో పెద్ది టాపిక్కే నడుతుంది. ఇదిలా ఉండగా.. పెద్దికి సంబంధించి ఓ ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. ఇది కేవలం గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామా మాత్రమే కాదట. అంతకు మించిన స్టోరీ సినిమాలో ఉందట. ఆటతో పాటు ఊరికి సంబంధించిన ఎమోషన్‌ని ఈ కథలో బలంగా చూపించబోతున్నాడట దర్శకుడు బుచ్చిబాబు. ఊరి బాగుకోసం హీరో ఏం చేశాడనేది ఈ సినిమా కథ. దానికి స్పోర్ట్స్ బ్యాక్‌గ్రౌండ్‌ని ఎంచుకొని.. అద్భుతమైన సన్నివేశాలను అల్లాడట బుచ్చిబాబు. కోచ్‌గా శివరాజ్ కుమార్, హీరో తండ్రిగా జగపతిబాబు పాత్రలను కూడా బలంగా తీర్చిదిద్దాడట. హీరోతో పాటు ఈ రెండు పాత్రల నిడివి కూడా ఎక్కువగానే ఉంటుందని సమాచారం. సినిమాలలో కీలక పాత్రల తీరు ఎలా ఉంటుందో ట్రైలర్‌లో చూపించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి వరకు పెద్ది కథ ఏంటి అనేది ఎవరికీ తెలియదు. ఎక్కడ లీక్ కూడా కాలేదు. ట్రైలర్ వస్తే కానీ అసలు ఈ సినిమా స్టోరీ ఏంటి అనేది తెలియదు. కుస్తీ, క్రికెట్ ఆటలకు ఈ కథతో ఉన్న సంబంధం ఏంటనేది కూడా ట్రైలర్‌లో చూపించే అవకాశం ఉంది.



### టాలీవుడ్‌కి బిగ్‌షాక్..
## ఐబొమ్మ మళ్లీ వచ్చేసింది

తెలుగు సినీ పరిశ్రమకు బిగ్ షాక్ తగిలింది. ఒకప్పుడు తీవ్రంగా ఇబ్బంది పెట్టి, వదిలి వెళ్లిపోయిన పైరసీ బూతం 'ఐబొమ్మ 'మళ్లీ వచ్చేసింది. తాజాగా రిలీజ్ అయిన కొత్త సినిమాలన్నీ ఈ వెబ్ సైట్ లో కనినిపిస్తున్నాయి. ఈ సైట్ నిర్వాహకుడు రవి అరెస్ట్ కావడంతో ఇక ఈ సమస్య తీరిపోయిందని భావించిన సినీ పెద్దలకు తాజా పరిణామాలు షాక్ ఇస్తున్నాయి. కొన్ని నెలల క్రితం సైబరాబాద్ పోలీసులు ఈ నెట్ వర్క్‌ను ఛేదించి, కీలక సూత్రధారిగా భావిస్తున్న రవిని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల ఆయన బెయిల్‌పై విడుదలైన కొద్ది రోజులకే సైట్ మళ్లీ ప్రత్యక్షమవ్వడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఐబొమ్మ తన డొమైన్లను మార్చుకుంటూ మళ్లీ రంగ ప్రవేశం చేసింది. థియేటర్లలో ఉన్న తాజా చిత్రాలు, ఓటీటీలో విడుదలైన కొత్త కంటెంట్ ఈ సైట్‌లో ప్రత్యక్షమవుతుండటంతో సినీ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. నిర్వాహకుడు బెయిల్‌పై ఉన్న సమయంలోనే సైట్ మళ్లీ యాక్టివ్ అవ్వడం వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను పోలీసులు నిశితంగా గమనిస్తున్నారు.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034